క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో పోచమ్మ గుడి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడానికి నేడు (శుక్రవారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు సామాజిక తనిఖీ

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ(ఈజీఎస్) పథకంలో భాగంగా 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 01 నుంచి 2025 మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను ప్రజా వేదికలో వెల్లడించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కావున మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

కమిటీ ఎన్నిక



ఎన్నికైన బీసీ సంఘం జేఏసీ కమిటీ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని బీసీ కుల సంఘాల జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో అన్ని బీసీ కుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల బీసీ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించి జేఏసీని ఏర్పాటు చేశారు. జేఏసీ చైర్మన్‌గా పైడిపల్లి రమేశ్, వర్కింగ్ చైర్మన్‌గా గట్ల రాజన్న, కన్వీనర్లుగా అందే భాస్కరాచారి, జోగు బుచ్చయ్య, కో కన్వీనర్‌గా బర్ల గట్టయ్య, క్యాతారాజు సాంబమూర్తి, గుమ్మడి ప్రదీప్, మేకల సంపత్, అమృత అశోక్, నలిగేటి సతీశ్, పోతర్ల మల్లికార్జున్, కోఆర్డినేటర్‌గా శేఖర్, మహిళ చైర్మన్‌గా మేకల రజిత, వర్కింగ్ చైర్మన్‌గా పద్మలను నియమించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



గణపురం: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారిగా ఎండీ.అఫ్రోజ్ అహ్మద్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా విద్యా సంబంధ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రణాళికలు తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓను పలువురు ఉపాధ్యాయులు కలిసి సన్మానించారు.

సన్మానం



టేకుమట్ల: మండలంలోని 26 వీఓఏలు మహిళా సంఘ సభ్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఓపెన్ పదో తరగతిలో ప్రవేశాలను కల్పించాలనే నిబంధన వచ్చిన విషయం తెలిసిందే. కాగా, టేకుమట్ల వీఓఏ వైనాల సరోజన మండలంలోని అందరి వీఓఏల కంటే ఎక్కువ మంది సంఘ సభ్యులను పదో తరగతిలో ప్రవేశాలకు సహకరించినందుకు గానూ గురువారం మండల కేంద్రంలో మండలంలోని వీఓఏలు ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏపీఎం మంజుల, సీసీ ఉమాదేవి, వీఓఏలు రమేశ్, సుమతి, శంకర్, సమ్మయ్య, తిరుపతి, స్వరూప, విజయ, స్వప్న, నవత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

ములుగు రూరల్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకుని, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలో అటవీ శాఖ మొబైల్ పార్టీ ఎఫ్ఆర్ఓ శ్రావణి కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున వెంకటాపూర్ మండలం జవహార్‌నగర్ టోల్‌గేటు వద్ద లారీలను తనిఖీ చేస్తున్న క్రమంలో పాత వే బిల్లుతో ఇసుక రవాణా చేస్తున్నట్లుగా గుర్తించామని తెలిపారు. ప్రస్తుత వే బిల్లు లేకుండా పాత వే బిల్లు పై ఇసుక తరలించడం చట్టరీత్యా నేరమని, లారీల యజమానులతో పాటు డ్రైవర్లపై కేసు నమోదు చేసి లారీలను ములుగు అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్!

- ఆన్‌లైన్‌లో అనుసంధానం
- కొనసాగుతున్న ఈ-కేవైసీ



ఈ-కేవైసీ చేస్తున్న అధికారులు

మల్హర్: జాతీయ గ్రామీణా ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడడం లేదు. పనుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు కూలీల జాబ్ కార్డులను ఆధార్ కార్డులకు అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తి చేశారు. అయినప్పటికీ కొందరు పనికి రాకున్నా హాజరు వేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అధునాతన టెక్నాలజీని రుపొందించింది. అక్రమాలను అరికట్టేందుకు కూలీల డాటాను అనుగుణంగా ఈ-కేవైసీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ఆన్‌లైన్‌లో హాజరు నమోదు..

ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీల ఈ-కేవైసీని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఉపాధి పనుల్లో హాజరు నమోదవుతుంది. గ్రామాల్లో నిర్దేశించిన పని ప్రదేశానికి కూలీ రాగానే ఫీల్డ్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తారు. పనులు పూర్తయి ఇంటికి వెళ్లే సమయంలో మరోసారి ఫొటో తీసి అప్లోడ్ చేస్తారు. రెండు సార్లు తీసిన ఫొటోలు యాప్‌లో సరిగా నమోదైతేనే కూలీలకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. దీంతో బినామీలకు చెక్ పడుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలోనే పనుల వివరాలను నమోదు చేస్తుండడంతో అవకతవకలు తగ్గుతాయని అధికారులు తెలుపుతున్నారు.

61 శాతం పూర్తి..

మండలంలో 10640 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 10638 ఆధార్‌కార్డుకు అనుసంధానం చేశారు. దీంట్లో 61.69 శాతం జాబ్‌కార్డుదారులకు ఈ-కేవైసీని ఫీల్డ్ అసిటెంట్లు ఇప్పటి వరకు పూర్తి చేశారు. తాడిచర్లలో 2397కి 1670 (69.67), మల్లారంలో 1069కి 559 (52.29 శాతం), పెద్దతూండ్ల లో 1455కి 802 (55.12 శాతం), చిన్నతూండ్లలో 435కి 353 (81.15 శాతం), దుబ్బపేటలో 125 గాను 104 (82.54 శాతం), అడ్వాలపల్లిలో 127కి 66 (51.97 శాతం), కొయ్యూరులో 377కి 160 (42.44 శాతం), కొండంపేటలో 514కి 329 (64.01 శాతం), వల్లెకుంటలో 980కి 486 (49.59 శాతం), ఇప్పలపల్లిలో 396కి 268 (67.68 శాతం), ఎడ్లపల్లిలో 754గాను 346 (45.89), రుద్రారంలో 673కి 431 (64.04 శాతం), అన్సాన్‌పల్లిలో 715కి 515 (72.03 శాతం), నాచారంలో 543 గాను 445 (81.95 శాతం, మల్లెంపల్లిలో 77గాను 29 (37.66 శాతం) ఈ-కేవైసీని పూర్తి చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి



మండలంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగతుంది. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ-కేవైసీ విధానానికి కూలీలు పూర్తిగా సహకరించాలి. ఈ-కేవైసీ ద్వారా అక్రమాలకు ఆస్కారం ఉండదు.

– శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ, మల్హర్

సమాజంలో చదువుతోనే గుర్తింపు

- ఎంఈఓ రఘుపతి



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: సమాజంలో చదువుతోనే మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓ రఘుపతి అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో వలంటరీ టీచర్లకు ఉల్లాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల అక్షరాస్యతను పెంచాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. చదువుకున్న మహిళ తన ఇంటిని, పిల్లలను సక్రమైన మార్గంలో పయనించేలా కృషి చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉల్లాస్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గుర్రపు రాజేందర్, ఉల్లాస్ కార్యక్రమ ఇన్‌చార్జ్ బోనగిరి తిరుపతి, వాలంటరీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

మండలంలోని శాంతినగర్, పాసిగడ్డతండ, దూత్‌పల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ రఘుపతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మంచి బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ఉంటూ చక్కగా చదువుకోవాలని అన్నారు. ఈ మేరకు విద్యార్థుల పరిజ్ఞాన సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు కావ్య, రాజేశ్, రమేశ్, సర్వేశ్వర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామకృష్ణగౌడ్

టేకుమట్ల: తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్రబంద్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని బీసీ మండల నాయకులు నేరెళ్ల రామకృష్ణగౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో బీసీ నాయకులతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అందించేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా తప్పకుండా రిజర్వేషన్లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సదానందం, వరదాచారి, నాంపెల్లి వీరేశం, అబ్బెంగుల రాజయ్య, కర్నె రాజయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరి



కాళేశ్వరం: పోషకాహారం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



చిట్యాల: అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజబాబు

కాళేశ్వరం: పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా మహదేవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోషకాహారం, పోషకాహారలోపం గురించి సైన్స్ టీచర్లు బి.ప్రభాకర్ రెడ్డి, మడక మధుల ఆధ్వర్యంలో సెమినార్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం తద్వారా ఆరోగ్య భారతదేశం సాకారం అవుతుందని అన్నారు. సెమినార్ నిర్వహణకు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ అనిల్ కుమార్ అధ్యక్షుడిగా వ్యవహరించాగా మండలంలోని ఉన్నత పాఠశాల 9వ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు సెమినార్ ప్రదర్శన చేసి ఆహారం ప్రాధాన్యత, పోషకాహారం, పోషకాహార లోపం, పేదరికం, ఆహార ధాన్యాల ఉత్పత్తి, హరిత విప్లవం, ప్రకృతి వ్యవసాయం లాంటి అంశాలు తీసుకొని ప్రజెంటేషన్ చేసి ప్రతిభ కనబరిచారు. అంగన్‌వాడీ టీచర్లు పలురకాల పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా పలురకాల ఆహార పదార్థాలను తయారు చేసుకొని తెచ్చి ప్రదర్శన చేస్తూ పోషక విలువల ప్రాధాన్యత వివరించారు. మండల విద్యాధికారి ప్రకాశ్‌బాబు, సీడీపీఓ రాధిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుస్మిత మండలంలోని పలు ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి

చిట్యాల: తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద తెలిపారు. గురువారం మండలంలోని నైన్‌పాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసోత్సవ వేడుకలతో పాటు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేపించారు. ప్రధానోపాధ్యాయులు ఊర్మిళరెడ్డి పాముకుంట్ల తిరుపతయ్య, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సుభద్ర, కరుణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

రేగొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మండల కేంద్రంలోని కార్యాలయంలో నేడు (శుక్రవారం) లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు సబ్ ఇంజనీర్ రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, నూతన సర్వీసులు మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు వంటి వాటికి రాత పూర్వకంగా వినియోగదారులు ఫిర్యాదులు అందిచ్చవచ్చని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న నిశిధర్‌రెడ్డి



చిట్యాల: పరామర్శిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన మోరె సముద్రమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు మోరె రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, రాజయ్య, రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సారక్క, అజ్మీరా నంద నాయక్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ గురువారం పరామర్శించారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు కాట్రేవుల కుమార్, రఘు, పోశాల రాజు, అంబాల రాజు, సృజన్, అశోక్, శివకృష్ణ, రమేశ్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధి కిషన్‌రావుపల్లిలో పశువులకు గురువారం పశువైద్య సిబ్బంది గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 60 పశువులకు టీకాలు వేశారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పశువులు వ్యాధుల భారినపడుతున్నాయని, రైతులు వారి ఆవులు, గేదెలు, ఎద్దులకు టీకాలు వేయించాలని సూచించారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై గురువారం వ్యవసాయ కమిషనర్, వ్యవసాయ డైరెక్టర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఏఓ శ్రీజ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా ఈ వానకాలంలో పంట నమోదు ప్రక్రియ, పత్తి అమ్మకానికి కపాస్ కిసాన్ యాప్ ప్రాధాన్యత, వినియోగం, సమగ్ర వ్యవసాయ యాంత్రీకరణ గురించి క్లుప్తంగా వివరించినట్లు ఏఓ చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి జే.బాపు, ఏడీఏలు రమేశ్, శ్రీపాల్, ఉద్యానవన శాఖ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, మండల ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

వేటగాళ్ల బైండోవర్



తహసీల్దార్ ఎదుట వేటగాళ్లు

పలిమెల: మండలంలో అడవి జంతువుల కోసం కరెంట్ వైర్లు, ఉచ్చులు బిగిస్తున్నారని లెంకలగడ్డ, పలిమెల, బోడాయిగూడెం, ముకునూరు గ్రామాలకు చెందిన 15 మంది అనుమానాస్పద వ్యక్తులను ఎస్సై జె.రమేశ్ పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి గురువారం కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ముందు హాజరు పర్చగా వారందరికీ ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అడవి జంతువులకు ఉచ్చులు పెట్టడం నేరమని, వాటి వలన మనుషులు కూడా గాయపడడం, మృతి చెందే ఆస్కారం ఉందని, ఎవరైనా పంట చేనుల చుట్టూ కరెంట్ వైర్, ఉచ్చులు పెట్టినా, పెట్టే వాళ్లకు సహకరించినా వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

కాటారం: మహాముత్తారం మండలం బోర్లగూడెంలో గురువారం బంజారాలు తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా లంబాడీల ఆరాధ్య దైవమైన దేవి జగదాంబ, సేవాలాల్ మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. లంబాడి మహిళలు, పురుషులు ప్రత్యేక దుస్తులు ధరించి సంప్రదాయ నృత్యాలు చేశారు. మహాముత్తారం తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. తీజ్ పండుగ లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్, జిల్లా నాయకులు ముకులోత్ శ్రీనివాస్ నాయక్, నవరామ్‌నాయక్, జీపీఓ రావుల సమ్మయ్య, శ్రీరామ్‌నాయక్, రాంలాల్, ధరంసింగ్, రాంసింగ్, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అనూష

కన్నాయిగూడెం : బాలల చట్టాలు, బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని బాలల భరోసా కేంద్రం ద్వారా కానిస్టేబుల్ అనూష సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు బాలల చట్టాలు, బాల్య వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోక్సో ,సైబర్ క్రైమ్ ప అవగాహన కల్పించారు. అనంతరం అనూష మాట్లాడుతూ... విద్యార్థులు బాల్య వివాహాలు జరిగితే తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చిన డయల్-100కు లేదా 1098 ఫోన్ చేయాలన్నారు. అనంతరం పాఠశాల ప్రత్యేక అధికారి అశ్విని మాట్లాడుతూ.. విద్యార్థులు బాలల చట్టాల అవగాహనతో పాటు చదువుపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలు రావడంతో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తోందన్నారు.

ఆర్థిక సాయం

మొగుళ్లపల్లి: మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన దేశిని మొగిలి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడి కుమారుడు ప్రశాంత్‌తో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.22,000 ఆర్థికసాయం అందజేశారు.


నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

వెంకటాపురం(కె) : కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్, తహసీల్దార్ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లోని 350 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం, నూనె, కూరగాయలు, దుప్పట్లు, తదితర వస్తువులను సీఐ, తహసీల్దార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మహిళలు, చిన్నారుల సమస్యలపై సఖి అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు, కాంగ్రెస్ నాయకులు మురళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, కోఆర్డినేటర్స్ గొంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, నరేష్, ప్రసాద్, భాస్కర్, స్వరూప, పద్మ, ఉష, ఇందిరా, రమాదేవి తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మంగపేట : ఎవరైనా అకస్మాత్తుగా గుండెపోటు బారినపడిన వెంటనే వారికి సీపీఆర్ చేసి ప్రాణం కాపాడొచ్చని చుంచుపల్లి వైద్యాధికారి యమున తెలిపారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా చాలా మంది హార్ట్ ఎటాక్‌తో చనిపోతున్నారని అన్నారు. గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ అనేది కీలక పాత్ర పోషిస్తుందని, సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గుండెపోటు లక్షణాలు ఎలా ఉంటాయి, ఎవరికైనా హార్ట్ ఎటాక్ వస్తే వారికి ఎలా సీపీఆర్ చేయాలని అనే అంశాలను వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలనే విషయంపై ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సీతమ్మ, సారమ్మ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



తిరుపతి(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలం ఆజాంనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారుకూరి తిరుపతి(26) పొలం వద్ద వ్యవసాయ బోరు మోటార్ రిపేర్ చేస్తుండగా విద్యుత్‌షాక్ గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న తిరుపతిని సమీప రైతులు గమనించి భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి చిన్న రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.